ప్రలోభాలకు లొంగం.. విలువలకే పట్టం కడతాం..



- తొలిసారి ఓటు వేయనున్న యువత మనోగతం
- ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలు..

ఇల్లెందురూరల్: ప్రజాస్వామ్య దేశంలో ప్రజల చేత.. ప్రజల కొరకు.. ప్రజల యొక్క.. సంపూర్ణ స్వరాజ్యాన్ని నిర్మించుకునేందుకు తమ నేతలను ఎన్నుకునే వేదిక ఎన్నికలు. ఎన్నికలంటే ప్రజా కోర్టులో ప్రజల అంతిమ తీర్పు. ప్రజల బంగారు భవిష్యత్.. దేశ ఆర్థిక స్థితిగతులను, కీర్తి ప్రతిష్టలను పునఃనిర్మించుకొనేందుకు ఉత్తమ పాలకున్ని ఎన్నుకునే వేదిక ఎన్నికలు.

అక్రమార్కులకు, దురహంకారపూరిత నేతలకు, నేరచరిత పాలకులకు శాశ్వతంగా వీడ్కోలు చెప్పడానికి ప్రజాస్వామ్యదేశంలో నిర్మించుకున్న వేదిక ఎన్నికలు. భ్రష్టుపట్టిన రాజకీయ వ్యవస్థలను, చెదలు పట్టిన విద్యా వ్యవస్థలను, వేళ్లానుకున్న లంచగొండి వ్యవస్థను, ఆకలితో అలమటిస్తున్న వ్యవస్థను ప్రక్షాళన.. శుద్ధి చేసుకొనేందుకు చక్కనైన వేదిక ఎన్నికలు. తలకెక్కిన పాలకుల అహంకారాన్ని, పొగరెక్కిన నేతల నిరంకుశత్వాన్ని, అనాదిగా వస్తున్న వారసత్వ రాజ కీయాల్ని.. పాతకుపోయిన అవినీతిని పారదోలేందుకు మంచి నేతను ఎన్నుకునే చక్కనైన వేదిక ఎన్నికలు.. ఇంతటి మహాశక్తివంతమైన ఎన్నికల ప్రక్రియలో ప్రజల చేతుల్లో ఉన్న వజ్రాయుధమే ఓటు.. అటువంటి విలువైన ఓటును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పదికాలాలపాటు మనగలుగుతుంది.

వారంలో ఎన్నికలు..

ప్రజాస్వామ్యదేశంలో ఓటు వజ్రాయుధం లాంటిది. తమకు నచ్చిన నేతను ఎన్నుకునే అవకాశం ఓటర్లకు ఉంది. పొరపాటు చేస్తే ఐదేళ్లు బాధపడాల్సి ఉంటుంది. ఈ వారంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు సిద్ధమైన యువ ఓటర్లను పలకరిస్తే.. వారు తమ అభిప్రాయాలను కుండబద్ధలు కొట్టారు. ఓటు హక్కును తప్పకుండా సద్వినియోగం చేసుకుంటామని, నిజాయితీ గల నాయకులను ఎన్నుకుంటామన్నారు.

సేవాగుణం కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తామని, ప్రలోభాలకు లొంగబోమని తెలిపారు. యువత రాజకీయాల్లోకి రావాల్సిన ఆవశ్యతకను గుర్తు చేశారు. ప్రజల్లో ఇంకా చైతన్యం రావాల్సి ఉందని, ఈ మేరకు యువత చురుకైన పాత్ర పోషించాలని కోరారు. తొలిసారి ఓటు వేస్తున్న యువత మనోగతం వారి మాటల్లో..

విజ్ఞతతో ఆలోచించి..



తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నందుకు ఆనందంగా ఉంది. నిజాయితీగా పనిచేసే నాయకులకు ఓటు వేస్తాను. నిబద్ధతతో పనిచేసే వారిని ఎన్నుకుంటే మంచి ప్రభుత్వాలు వస్తాయి. లేదంటే కుంభకోణాలు రాజ్యమేలుతాయి. ప్రతిఒక్కరూ విజ్ఞతతో ఆలోచించాలి.

– ఆళ్ల శృతి, సుభాష్‌నగర్

పక్షపాతం లేని వారికే ఓటు



ఎలాంటి పక్షపాతం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సేవ చేయాలనే భావం ఉన్న మంచి నాయకుడికి ఓటు వేస్తాం. ప్రజలందరి సమస్యలపై స్పందించే గుణం ఉండాలి. ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా ఉండాలి. అందరినీ బాగా డీల్ చేయగల వారికే నా మొదటి ఓటు వేస్తా.

– ముక్తి దీపిక, మామిడిగుండాల

సేవా గుణం ఉన్న వారికే ఓటు



ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు. పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలను పరిశీలించి ఓటు వేయాలి. ఎమ్మెల్యే, ఎంపీలు చట్టసభల్లో చట్టాలు రూపొందించడంలో కీలకంగా ఉంటారు. వారిలో సేవాగుణం లోపిస్తే ప్రజావ్యతిరేకమైన చట్టాలు వచ్చే ప్రమాదం ఉంది.

– జోగ సందీప్, ఒడ్డుగూడెం

క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభ

పాల్వంచ: ఈనెల 21న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కళా ఉత్సవ్‌లో పాల్వంచకు చెందిన నవభారత్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జానపద నృత్యంలో బి.షణ్ముఖ వర్ధన్, ఏకపాత్రాభినయంలో ఎ.మల్లికార్జున్, 3డి విజువల్ ఆర్ట్స్‌లో ఎండీ అయాస్, 2డి విజువల్ ఆర్ట్స్‌లో జయ సూర్య, 3డి విజువల్ బాలికల విభాగంలో బి.సునందిని బహుమతులు సాధించారు. గురువారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎంపీఎస్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీదేవి విద్యార్థులను అభినందించారు.

'ప్రియదర్శిని'విద్యార్థిని..

కొత్తగూడెంఅర్బన్: వరంగల్ కిట్స్ కాలేజీలో జరిగిన కాకతీయ యూనివర్సిటీ స్థాయిలో 45 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో స్థానిక ప్రియదర్శిని డిగ్రీ, పీజీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని సీహెచ్.గంగాభవాని ఎంపికైనట్టు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

జూలూరుపాడు: మండలంలోని గుండ్లరేవు, అన్నారుపాడు, జేత్యాతండా అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలాజ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. పిల్లల హాజరు శాతాన్ని పరిశీలించి, ప్రతీరోజు పిల్లల హాజరును యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు శారద, సుబ్బు, ఆయాలు, పిల్లలు పాల్గొన్నారు.

అన్ని పార్టీలూ ముమ్మర ప్రచారం..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం మరింతగా అభివృద్ధి చేదాలంటే అందరూ మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావుకు మద్దతు పలకాలని రానున్న ఎన్నికల్లో సింహం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రామవరం జలగం యువసేన నాయకులు సురిమేను మోహన్ కోరారు. గురువారం పలు వార్డులోని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఇల్లెందురూరల్: ప్రజాపంథా బలపర్చిన స్వతంత్ర అభ్యర్థి గుమ్మడి అనురాధ విజయాన్ని కాంక్షిస్తూ ప్రజాపంథా కార్యకర్తలు గురువారం మండలంలోని మర్రిగూడెం, పోలారం గ్రామపంచాయతీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఏసీ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. విప్లవ రాజకీయాలలో క్రియాశీలక కార్యకర్తగా సుదీర్ఘకాలం పనిచేసిన అనురాధ ఉన్నత చదువులు చదివి లా కళాశాల ప్రొఫెసర్‌గా విధుల్లో చేరిందని గుర్తుచేశారు. కార్యక్రమలలో నాయిని రాజు, కుమార్, శ్రీరాం కోటయ్య, చంద్రశేఖర్, లక్ష్మయ్య, చుక్కయ్య, బాబు, రాంబాబు పాల్గొన్నారు.

జూలూరుపాడు: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికల ప్రచారం పోటాపోటీగా నిర్వహిస్తున్నాయి. గురువారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్ గెలుపు కోసం, బీఆర్ఎస్ శ్రేణులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం చేవారు.

మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట



పాల్వంచ: ఎన్నికల ప్రచారం చేస్తున్న కొత్వాల శ్రీనివాసరావు



సింగరేణి(కొత్తగూడెం): ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రశ్నించే గొంతుకను అసెంబ్లీకి పంపిద్దామని 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ, మండల కాంగ్రెస్ నాయకులు సత్యరాజ్ ఓటర్లను కోరారు. కాంగ్రెస్, సీపీఎం, టీజేఎస్ బలపరిచిన కూనంనేని సాంబశివరావు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరంలోని 10వ వార్డులోని ఇందిరమ్మకాలనీ, బర్మా క్యాంపు, నాగయ్యగడ్డలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు గృహజ్యోతి కింద రూ.200 యూనిట్ల ఉచిత విద్యుత్ కావాలంటే కంకి కొడవలికి ఓటేద్దామని, మహాలక్ష్మి పథకం కింద రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ నెలకు రూ.2500, రూ.500లకే గ్యాస్ సిలిండర్ కావాలంటే మీ అమూల్యమైన ఓటును కంకి కొడవలికి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో మునిగడప వెంకటేశ్వర్లు, రావుల దాసు, అల్లకొండ గోపి, గట్టు చంద్రశేఖర్, ఉపతల శ్రీను, వాసం బాబు, అరుణ పాల్గొన్నారు.

పాల్వంచ: మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని, ఆరు గ్యారంటీలతో అనేక పథకాలు తీసుకొస్తుందని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పట్టణంలోని పాత పాల్వంచ, కరకవాగులో కొత్వాల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును గెలిపించాలన్నారు.

పాలనలో విఫలం.. హామీల అమలులో మోసం: కోరం



కామేపల్లి: ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య



ఇల్లెందురూరల్: బాలాజీనగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

కామేపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసిందని.. ప్రభుత్వ పాలనలే విఫలం కావడమేకాక ఇచ్చిన హామీలన్నింటినీ విస్మరించిందని ఇల్లెందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య ఆరోపించారు. ఆమేపల్లి మండలంలోని కొమ్మినేపల్లి, బండిపాడు, కొత్తలింగాల, సాతానిగూడెం, ముచ్చర్ల, జాస్తిపల్లి గ్రామాల్లో గురువారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులరూ.2 లక్షల రుణమాఫీ చేయడంతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. గతంలో కాంగ్రెస్ హయాంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన వైద్యం అందిందని గుర్తుచేశారు. ఆతర్వాత బీఆర్ఎస్ హయాంలో ఏ హామీని అమలుచేయలేదని మండిపడ్డారు. అధికార పార్టీ నాయకుల మాటలు నమ్మకుండా హస్తం గుర్తుకు ఓటు వేయాలని కనకయ్య కోరారు. కాంగ్రెస్‌తో పాటు మిత్రపక్ష పార్టీల నాయకులు బానోత్ సుజాత, తోటకూరి శివయ్య, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, మేకల మల్లిబాబుయాదవ్, అప్పన పిచ్చయ్య, ఆరెం రవి, దేవండ్ల రామకృష్ణ, నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, జక్కంపూడి వెంకటేశ్వర్లు, బానోత్ నర్సింహనాయక్, మేకపోతుల మహేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక...

టేకులపల్లి: టేకులపల్లి మండలం రాంపురం పంచాయతీ పాతతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు భూక్య గాంధీ కాంగ్రెస్‌లో చేరగా కోరం కనకయ్య ఆహ్వానించారు. నూనావత్ బిక్కులాల్, గుగులోత్ సక్రు, నూనావత్ భద్రు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రతీ కుటుంబానికి సంక్షేమం

ఇల్లెందు/ఇల్లెందురూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతాయని ఆ పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ అభ్యర్థి కోరం కనకయ్యను గెలిపించాలని కోరుతూ ఇల్లెందు మండలం బాలాజీనగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పులి సైదులు, సర్పంచ్ పాయం స్వాతితో పాటు రంజిత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఇల్లెందులోని పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ నాయకులు ఎస్.కే.జానీ, బంధం నాగయ్య, ముద్రగడ వంశీ ఆధ్వర్యానప్రచారం చేశారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందాలంటే కాంగ్రెస్‌కే అధికారంలోకి రావాల్సిన అవసరముందని తెలిపారు. ప్రచారంలో వారా రవి, నవీన్, స్వప్న, ఈశ్వర్, స్వరూప, అక్కిరాజు గణేష్, జీ.వీ.భద్రం, హరిబాబు, మడుగు సాంబమూర్తి పాల్గొన్నారు.

పిలిస్తే పలికే నాయకుడు వనమా..



నవభారత్: ప్రచారంలో పాల్గొన్న చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్లు



చుంచుపల్లి: బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

నవభారత్: పిలిస్తే పలికే నాయకుడు వనమా వెంకటేశ్వరరావు అలాంటి నాయకుడిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వనమా గెలుపును కాంక్షిస్తూ మున్సిపల్ కౌన్సిలర్లు చేపట్టిన గడప గడపకు వనమా కార్యక్రమంలో సీతాలక్ష్మి పాల్గొని మాట్లాడారు. కళ్ల ముందు వనమా చేసిన అభివృద్ధి కనిపిస్తోంది.. ఆయన స్థానికుడు కాబట్టి వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎంపీ వద్దిరాజు సమక్షంలో..

చుంచుపల్లి: కొత్తగూడెం నియోజకవర్గానికి చెందిన బీజేవైఎం అధ్యక్షుడు జోగు ప్రదీప్ కుమార్‌తో పాటు పలువురు యువకులు ఆ పార్టీకి రాజీనామా చేసి గురువారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, కోనేరు చిన్ని సమక్షంలో కొత్తగూడెం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జోగు రమాదేవి, అయేషా, ప్రవీణ్, రాహుల్, సందీప్, విజయ్, ప్రవీణ్, చింటూ, భాస్కర్, రేవంత్ పాల్గొనారు.

జై భారత్.. జస్ట్ ఓట్..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాల్వంచ: ఎన్నికల్లో ధనస్వామ్యాన్ని తరిమికొట్టి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని, ఓటు హక్కును అమ్ముకుంటే బతికి ఉన్నా లేనట్లేనని జై భారత్.. జస్ట్ ఓట్.. తెలంగాణ క్యాంపెయిన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఖదిజ్జాసి వీరయ్య అన్నారు. గురువారం పట్టణంలోని శాస్త్రీ సెంటర్‌లో సమావేశాన్ని నిర్వహించి వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ప్రజలంతా జై భారత్.. జస్ట్ ఓట్.. ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో నాయకులు డబ్బులను విచ్చలివిడిగా పంచుతూ.. నేతలను, కార్యకర్తలను, ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని తద్వారా ఓటుకు విలువ లేకుండా పోతోందన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, త్రిమూర్తులు, రమణ, దయానంద ఎస్‌జేకే అహ్మద్, నాగరాజు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కాంగ్రెస్ గూటికి..



వెంకటమ్మకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి తిరిగి స్వాగతిస్తున్న కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామ పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మోకాళ్ల వెంకటమ్మ బుధవారం అర్ధరాత్రి బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ నాయకులు ఆమెను వెంట తీసుకెళ్లి కొత్తగూడెంలో పార్టీ పెద్దల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేర్చారు. 24 గంటలు గడవకముందే తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య సమక్షంలో తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో పార్టీ బలం పెంచుకునేందుకు వలసలను ప్రోత్సహిస్తున్న పార్టీలు ఆ దిశగా అడుగులు వేస్తూ కొన్ని చోట్ల సఫలీకృతులు అవుతుండగా మరికొన్ని చోట్ల విఫలమవుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా నేతలు, కార్యకర్తల పార్టీ మార్పు మండలంలో నిరంతరాయంగా చోటుచేసుకోవడంతో ఏ క్షణంలో ఎవరు ఏ పార్టీలో ఉంటారోనని ప్రజలు సైతం ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తాం...



నిరసన తెలుపుతున్న బర్లగూడెం గ్రామస్తులు

టేకులపల్లి: బర్లగూడెం గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒడ్డుగూడెం నుంచి కొప్పురాయి వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డు ప్రమాదకరంగా మారింది. దశాబ్దాలు దాటుతున్నా.. పాలకులు మారుతున్నా బీటీ రోడ్డుకు మాత్రం మోక్షం లభించడం లేదు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారాలకు వస్తున్న నాయకులను గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అత్యవసర వైద్య సేవలకు ఇబ్బందిగా ఉందని, బీటీ నిర్మాణం చేపట్టకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

బీఆర్ఎస్‌ను ప్రజలే గెలిపించుకుంటారు: హరిప్రియ



గార్ల: ప్రచారంలో మాట్లాడుతున్న హరిప్రియ



ఇల్లెందు: పట్టణంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: దశాబ్దకాలంగా అమలైన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని కొనసాగించుకునేందుకు ప్రజలే బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటారని ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ తెలిపారు. ఇల్లెందు చేశారు. మండలంలోని కొమ్ముగూడెం, లచ్చగూడెం గ్రామాలకు చెందిన పలువురు గురువారం బీఆర్ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ప్రజలతో కలిసి హరిప్రియ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించిన ఆమె మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా అత్యధికంగా నిధులు మంజూరు చేయించి ప్రతీ పల్లెలో సీసీ రహదారులు, గ్రామాల మధ్య బీటీ వేసుకున్నామని తెలిపారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయని, విద్య, వైద్య సదుపాయాలు మెరుగయ్యాయని చెప్పారు. ఎన్నికల సమయంలో తప్పుడు హామీలు ఇచ్చే వారిని కాకుండా మరింత అభివృద్ధి కోసం తనను గెలిపించాలని హరిప్రియ కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుకతో పాటు దాస్యం ప్రమోద్‌కుమార్, ఘాజీ పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించండి...

గార్ల: ఒకరి చేతుల్లో ఉండే కీలుబొమ్మను కాకుండా ప్రశ్నించే గొంతుక అయిన తనను గెలిపించి ఇల్లెందు నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడాలని బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ కోరారు. గార్లలో రోడ్‌షో ద్వారా ప్రచారం చేసిన ఆమె మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన తనను ఎమ్మెల్యేగా మరోమారు గెలిపించాలన్నారు. అవకాశవాదులు పార్టీ మారినంత మాత్రాన అభివృద్ధి మారిపోదన్నారు. ఇంటి ఆడబిడ్డగా ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, కామేపల్లి జెడ్పీటీసీ ప్రవీణ్‌నాయక్‌తో పాటు లక్ష్మణ్, రమేష్, ఉమేష్, గణేష్, ఉత్తరయ్య, రవి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి...

ఇల్లెందు: గడిచిన ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యేగా హరిప్రియ చేసిన అభివృద్ధిని చూసి మరోమారు గెలిపించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్, కౌన్సిలర్ కొండపల్లి సరిత కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ గెలుపును కాంక్షిస్తూ పలు వార్డుల్లో వారు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ బస్తీలో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఇక ఎమ్మెల్యే హరిప్రియ నియోజకవర్గ రూపురేఖలు మార్చేందుకు అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. ప్రచారంలో బానోతు రవినాయక్, దండు సారిక, కొండపల్లి కోటేశ్వరరావు, నారాయణ, ముత్యాల శ్రీనివాస్, గిరి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం..

ఇల్లెందురూరల్: పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తేనే ప్రతీఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత అన్నారు. చెన్నంగుల గడ్డ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, గ్రామంలోని గర్భిణులు, బాలింతల వద్దకు గురువారం స్వయంగా వెళ్లి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఒడ్డుగూడెం సబ్‌సెంటర్‌ను తనిఖీ చేసి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు.

రోడ్ షోలను జయప్రదం చేయండి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గ సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా నవంబర్ 24న కొత్తగూడెంలో ఎన్నికల ప్రచారం, రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, కాంగ్రెస్, సీపీఎం, టీడీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ అంటే ప్రత్యేక అభిమానం



మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్, పక్కన బీజేపీ, జనసేన అభ్యర్థులు

చుంచుపల్లి: తెలంగాణ ప్రాంతమన్నా, ఇక్కడి ప్రజలన్నా తనకు ఎంతో అభిమానమని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. తనకు తెలంగాణ నేల పునర్జన్మనిచ్చిందని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీ, జనసేన తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ కొత్తగూడెంలో గురువారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం 1200 మంది ప్రాణాలు అర్పించారని, లక్ష్యసాధన కోసం వీరోచితంగా పోరాడారని అన్నారు. నాటి సకల జనుల సమ్మె మరింత స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ఆ గౌరవంతోనే తెలంగాణలో ఇప్పటివరకు ఎవరిపైనా తాను విమర్శలు చేయలేదన్నారు. దశాబ్దకాలంగా తాను ఇక్కడ అందుబాటులో లేకున్నా అభిమానులు, జనసైనికులు, మహిళలు తనకు అండగా నిలిచారని చెప్పారు. తాను 2009 నుంచి బీజేపీతో కలిసి నడుస్తున్నానని, రాజకీయాల్లో మార్పు తీసుకురావాలన్నదే తన లక్ష్యమని అన్నారు. దేశంలోని అత్యధిక రాష్ట్రాల్లో బీసీ ముఖ్యమంత్రులు ఉన్నారని, తెలంగాణలోనూ బీసీని సీఎంను చేస్తామని ప్రధాని మోదీ వాగ్దానం చేయడం అభినందనీయమని తెలిపారు. ఇక నుంచి తెలంగాణ ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటానని అన్నారు. కాళోజీ, దాశరథి వంటి మహానుభావులను ఆదర్శంగా తీసుకుని అణగారిన ప్రజలకు అండగా నిలుస్తామన్నారు. రాష్ట్రంలో బీజేపీ మద్దతుతో జనసేన అభ్యర్థులు 8 స్థానాల్లో బరిలో నిలిచారని, అందులో అత్యధిక స్థానాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఉన్నాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జనసేన అభ్యర్థులను ఆదరించాలని కోరారు. సభలో ఏపీ జనసేన రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జ్ నాదెండ్ల మనోహర్, బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవదర్, రాష్ట్ర కార్యదర్శి బంగారు శృతి, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, కె.వి.రంగా కిరణ్, బీజేపీ, జనసేన అభ్యర్థులు లక్కినేని సురేందర్ రావు, రవీంద్ర నాయక్, కుంజా ధర్మ, ముయ్యబోయిన ఉమాదేవి, పొడియం బాలరాజు, నంబూరి రామలింగేశ్వర రావు, నున్న రవికుమార్, విజయరాజు, మిర్యాల రామకృష్ణ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

జూలూరుపాడు: పడమటనర్సాపురం హెల్త్ సబ్ సెంటర్‌లో స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎం.శ్రీదేవి ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్యసేవలను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ కార్యక్రమంలో ఏఎన్ఎం.ఆదిలక్ష్మి, ఆఫీస్ సబార్డినేట్ సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.